క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పెదకాకాని, వెనిగండ్ల గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీ పీహెచ్ ఖాన్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ బత్తుల శ్రీనివాసరావు కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కాకుమాను: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం తెలిపారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సమావేశంలో మండలంలోని గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

12న డైట్ కళాశాలలో విద్యార్థులకు పోటీలు

డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌డీ సుభాని

ప్రత్తిపాడు: ఈ నెల 12వ తేదీన ప్రత్తిపాడు మండలం బోయపాలెంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు రోల్ ప్లే, ఫోక్ డ్యాన్స్ పోటీలను నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సుభాని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో బాలబాలికలకు జరగనున్న పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వెంట సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు ఒకరు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు డైట్ కళాశాల అధ్యాపకుడు పి.పోలేరును 9704790917 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేబ్రోలు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురవటంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో సోమవారం జరిగింది. గుంటూరు నల్లచెరువు ప్రాంతానికి చెందిన అల్లం రామారావు బైక్‌పై తెనాలి వైపు వెళ్తున్నాడు. నారాకోడూరు వేబ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఘటనలో రామారావు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగుడు మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన అనంతలక్ష్మి అనే మహిళ తాను నివాసం ఉండే ప్రాంతానికి రెండు రోడ్ల అవతల సొంత ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో సాయంత్రం నిర్మించుకుంటున్న ఇంటి నుంచి తిరిగి నడుచుకుంటూ తాను నివాసం ఉంటున్న ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. మహిళ తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి దాతల విరాళం



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం పలువురు దాతలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన జన్మదినోత్సవం సందర్భంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.50వేల ఆర్థికసాయం చేశారు. గ్లోబల్ దయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు లక్ష్మణ్ రూ. 10 వేలు, జీజీహెచ్ ఆరోగ్యశ్రీ సిబ్బంది రూ. 10 వేలు, మమతా మెడికల్స్ నిర్వాహకులు చంద్రశేఖర్ రూ.10 వేలు, జయలక్ష్మి ఏజెన్సీస్, ఐక్యత ఆరదో నీడ్స్, రైస్‌టో బ్లడ్ బాంక్ రూ. 5వేలు, సిరక్స్ బయో మెడికల్ సిబ్బంది రూ. 5 వేలు విలువ గల ఫింగర్ పల్స్ ఆక్సీమీటర్స్ అందజేసి, డాక్టర్ కిరణ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేణు, కార్తిక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాగునీరు వృథా

నెహ్రూనగర్: నగరంలో కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా పైపులైన్లకు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతున్నా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. తుఫాన్ నగర్ (మహాప్రస్థానం) వెళ్లే రోడ్డులో కొద్ది రోజులుగా రోడ్డు వెంట తాగునీరు వృథాగా పోతోంది. దీంతో ఇంజినీరింగ్ అధికారుల తీరుపై స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే 'సురక్ష' లక్ష్యం

పెదకాకానిలో జగనన్న ఆరోగ్య సురక్షలో 314 మందికి వైద్య సేవలు



పెదకాకానిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు మందులు పంపిణీ

పెదకాకాని: ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి అన్నారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా జరుగుతుందన్నారు. పేషెంట్ల సమస్య ఆధారంగా అవసరాన్ని బట్టి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. దశల వారీగా శిబిరాలు నిర్వహించడానికి 15 రోజుల ముందే ఇంటింటికీ వెళ్ళి అనారోగ్య సమస్యలను గుర్తించి టోకెన్‌లు మంజూరు చేశారు. ఈ శిబిరం ద్వారా 314 మందికి వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిభిరం ఏర్పాట్లను ఆసుపత్రి సూపర్‌వైజర్ పి శ్రీనివాసరావు . కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రామాంజిరెడ్డి, డాక్టర్ పి.ప్రవీణదీప్తి, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ భవిష్యలు వైద్యసేవలు అందించారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్, డాక్టర్ రూము, వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం వంటి ప్రత్యేక డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, తహసీల్దార్ పి.రత్నం, సూపరింటెండెంట్ బి.వి.మల్లేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

461 మందికి వైద్య పరీక్షలు



లబ్ధిదారులకు పీఎంజేఏవై కార్డులను అందిస్తున్న ఎంపీపీ హెప్సిభా

పెదనందిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 461 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీపీ హెప్సిభా తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న హెప్సిభా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ప్రజలందరికి అవసరమైన వైద్య పరీక్షలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి చేస్తారని, అత్యవసరమైతే హాస్పిటల్‌కు వారే సిఫారసు చేస్తారని ఆమె చెప్పారు. అవసరమైన అన్ని రకాల మందులను కూడా ఈ శిబిరం వద్ద పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరంలో సర్పంచ్ జె.దానమ్మ, ఎంపీటీసీ సుందర్, వైద్యాధికారులు విజయరత్నకుమార్, ఎండీ అతియా, వి.అనిల్ కుమార్, ప్రత్తిపాడు సీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, సీహెచ్‌వో ప్రసాద స్వామి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దండమూడి గ్రామంలో ..

పొన్నూరు: మండలంలోని దండమూడి గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 343 మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలలో మెరుగైన వైద్య చికిత్స అందించే విధంగా వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కంటి సమస్యలు, షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు కె.శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ వంశీ రెడ్డి, మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్. మహమ్మద్ హుస్సేన్, పంద్రాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ . శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రేటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

కాకుమాను: మండలంలోని రేటూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు తిక్కిరెడ్డిపాలెంలో

ప్రత్తిపాడు: మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో మంగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏ శ్రీరమ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వలంటీర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది వేర్వేరుగా సర్వే ప్రక్రియను పూర్తి చేశారని, నేడు జరిగే శిబిరంలో రోగులకు ఆయా విభాగాల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేస్తారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలకే స్పెషలిస్టు వైద్యులు వస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

- విభాగాధిపతే నేరుగా పరిశీలించాలి
- నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులతో పాటు అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. కొన్ని విభాగాల అధికారులు ఫిర్యాదు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారని, ప్రజలు తిరిగి ఫిర్యాదు రీ ఓపెన్ చేస్తున్నారని ఆమె తెలిపారు. సదరు అర్జీలను విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్సు చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు.

ప్రజల నుంచి 55 ఫిర్యాదులు

ప్రజల నుంచి స్పందనలో 55 ఫిర్యాదులు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్ విభాగానికి 19, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 12, ఉపా సెల్ విభాగానికి 4 ఫిర్యాదులు అందాయి. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య కార్మికుడు ఆగిపోగు అజయ్ కుమార్ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్‌ను సోమవారం కౌన్సిల్ హాల్లో కమిషనర్ అందించారు. నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పీఎఫ్ త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులు, సూపరింటెండెంట్లను ఆదేశించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): వివాహిత అదృశ్యంపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన తోకల గోపికి 2013లో గుంటూరురూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన మౌనికతో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గోపి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 8వ తేదీ తెల్లవారుజామున గోపి భార్య మౌనిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి వెతికినప్పటికీ కనిపించకపోవడంతో భర్త గోపి సోమవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు.

ద్విచక్ర వాహనం దగ్ధంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేవీపీ కాలనీ 2/8లో నివసించే ఎం.వెంకటేష్ ఈనెల 8న ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి లోపలకు వెళ్లాడు. సోమవారం ఉదయం బయటకు వచ్చి చూసేసరికి వాహనం తగులబడి ఉంది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిపై దాడి

పట్నంబజారు: కళాశాలలో ఘర్షణ నేపథ్యంలో విద్యార్థిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులో నివసించే బాలాజీ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. అదే కళాశాలకు చెందిన నాగసాయితో కొంతకాలం కిందట వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో నాగసాయి, మరికొంత మంది కలసి బాలాజీపై కాకాని రోడ్డులో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశానికే అన్నదాత ఎం.ఎస్. స్వామినాథన్



అవగాహన సంస్థ కార్యాలయంలో స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

లక్ష్మీపురం: దేశ ప్రజల ఆహార కొరత తీర్చిన గొప్ప మానవతావాది డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మక మలుపు తిప్పిన ఓ దార్శనికుడిని దేశం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికే అన్నదాతగా స్వామినాథన్‌ను కొనియాడారు. ఉత్తమ రైతు పురస్కార గ్రహీత బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో గడ్డు పరిస్థితుల నడుమ స్వామినాథన్ మొక్కవోని పట్టుదల, నిబద్ధత, ముందుచూపుతో ఉజ్వల వ్యవసాయ శకానికి నాంది పలికారని తెలిపారు. వ్యవసాయ రంగంలో ముఖ్యంగా గోధుమ సాగులో భారత్ స్వయం సమృద్ధ దేశంగా రూపొందడానికి కారకుడని తెలిపారు. అనంతరం సంస్థ సభ్యులు చంద్రశేఖర్, డాక్టర్ సురేష్‌కుమార్, సత్యనారాయణ నివాళులర్పించి ప్రసంగించారు.

ఉపాధ్యాయురాలి దాతృత్వం



విద్యార్థులతో మేరీ వరకుమారి, తిలక్‌బాబు, విజయకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మద్దు మేరీ వరకుమారి తన వేతనంలో ప్రతి నెలా రూ.14వేలను 15 మంది పేద విద్యార్థులకు ఫీజుల రూపంలో చెల్లిస్తూ దాతృత్వాన్ని చాటుతున్నారు. విద్యానగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు సూచన మేరకు సంబంధిత విద్యార్థులకు చెక్కు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిలక్‌బాబు మాట్లాడుతూ గత మూడేళ్లుగా వరకుమారి విద్యార్థుల ఫీజుల కోసం రూ.3.50 లక్షల మేరకు ఆర్థిక సహాయాన్ని అందించారని, 15 మంది విద్యార్థులకు ఆమె ఆసరాగా ఉంటున్నారని వివరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారాన్ని సైతం అందుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయిని వరకుమారి మాట్లాడుతూ ఒక టీచర్‌గా పని చేస్తున్న తాను పేద విద్యార్థులను చదివించడం సామాజిక బాధ్యతగా భావించి ఆర్థికంగా సహాయ, సహకారాలు అందిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు కోశాధికారి విజయకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ చౌదరి పాల్గొన్నారు.

వ్యక్తిని బెదిరించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని కొందరు బెదిరించి ప్రాంసరీ నోట్లు రాయించుకున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వికాస్‌నగర్ 2వ లైనులో నివసించే కుడితిపూడి వెంకట కృష్ణారావు ఈనెల 6న ఇంట్లో ఉండగా, బృందావన్ గార్డెన్స్‌కు చెందిన నిమ్మలగడ్డ అరుణ్‌కుమారి, విద్యానగర్‌కు చెందిన పూనాటి రమేష్, సురేష్‌బాబు అనుచరులతో వచ్చారు. ఆర్థిక లావాదేవీల్లో ఏర్పడిన వివాదం కారణంగా వెంకట కృష్ణారావును బెదిరించి నాలుగు ప్రాంసరీ నోట్లు రాయించుకుని వెళ్లారు. ఈ మేరకు ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

సోదరుడి కుమారుడిపై దాడి చేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్ట్‌పేటలో నివసించే ఒర్సుమల్ల దిలీప్‌రాజా ఈనెల 5న చెత్త బయట పడేసేందుకు ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. పాత కక్షల నేపథ్యంలో అతడి బాబాయి వెనుకగా వచ్చి ఇనుప రాడ్‌తో తలపై కొట్టగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలలో వెల్లలూరు జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

పొన్నూరు: జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలలో పొన్నూరు మండలంలోని వెల్లలూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈనెల 7వ తేదీన చిలుకలూరిపేట ఏఎంజీ పాఠశాలలో జరిగిన బాక్సింగ్ స్కూల్ గేమ్స్ డిస్ట్రిక్ట్ సెలక్షన్‌లో విద్యార్థులు ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయులు కే రమేష్ తెలిపారు. పలు విభాగాలలో పోటీలు జరగగా 42 కేజీల విభాగంలో పి.మానస, 44 కేజీల విభాగంలో పి.కీర్తి, 50 కేజీల విభాగంలో ఎం.తరుణ్, 52 కేజీల విభాగంలో లాస్య, 54 కేజీల విభాగంలో కె.జీవిత, 56 కేజీల విభాగంలో పి.శిరీష, 70 కేజీల విభాగంలో శ్రావణిలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీలలో పాల్గొననున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీలలో విజేతలైన విద్యార్థులను , పి.డి. దాసరి సరళదేవిలను అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

పెదకాకాని గ్రంథాలయంలో ప్రపంచ తపాలా దినోత్సవం



పెదకాకాని గ్రంథాలయంలో ప్రపంచ తపాలా దినోత్సవంలో పోస్ట్‌మాస్టర్ వంశీ తదితరులు

పెదకాకాని: పెదకాకాని గ్రంథాలయంలో సోమవారం ప్రపంచ తపాలా దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వేములవిజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెదకాకాని పోస్ట్ మాస్టర్ వంశీ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జపాన్‌లోని టోక్యోలో 1969 యూపీయూ కాంగ్రెస్‌లో అక్టోబర్ 9న మొదటిసారిగా ప్రపంచ తపాలా దినోత్సవంగా ప్రకటించారు . ఈ ప్రతిపాదనను భారత ప్రతినిధి బృందంలోని సభ్యుడు ఆనంద్ మోహన్ నరుల సమర్పించారు. అప్పటి నుంచి తపాలా సేవల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ తపాలా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని ఆయన తెలియచేశారు. అలానే పోస్ట్ ఆఫీస్ సేవలైన టెలిగ్రామ్, స్పీడ్ పోస్ట్, ఆర్డినరీ పోస్ట్, పోస్ట్ ఆఫీస్‌లో సేవింగ్స్ ఎలా చేయాలి వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు



పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం అధికారులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించి మంచి దిగుబడులతోపాటు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి తెలిపారు. సోమవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో పత్తి పంటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు నీమాస్త్రం ఏవిధంగా తయారు చేసుకోవాలి, ఏవిధంగా పిచికారీ చేయాలని ప్రత్యక్షంగా చేసి చూపించారు. దీని ద్వారా పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయన్నారు. నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు పంటలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. బుట్టలను ప్రతి రోజు గమనిస్తూ పురుగుల ఉధృతిని బట్టి మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. రైతు శంకరరావు తన పంటల్లో ప్రకృతి వ్యవసాయ అనుభవాలను స్థానిక రైతులతో పంచుకున్నారు. అడిషనల్ డీపీఎం జానా కీదేవి, డీఎంఎల్ సత్యన్నారాయణ క్షేత్రస్థాయిలో రైతుల పొలాలు సందర్శించి తగిన యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు శ్రీను, పెద్ద పాములు, చిన్న పాములు, జోజయ్య, బాబు, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చలపతిలో ముగిసిన టెక్ నిర్వాణ 2కే23 జాతీయ స్థాయి సదస్సు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరాలని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో టెక్‌నిర్వాణ 2కే23 జాతీయ స్థాయి సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇటువంటి జాతీయ స్థాయి సదస్సులో పాల్గొనటం ద్వారా విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కోడ్‌క్రాఫ్ట్ చాలెంజ్, ఇన్నోవేషన్ షోకేజ్, తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, డాక్టర్ ఎ.బాలాజి, తదితరులున్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళులు



కాన్షీరామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

నెహ్రూనగర్: బడుగు, బలహీన వర్గాల ప్రజల్ని చట్టసభల్లోకి నడిపించిన గొప్ప నాయకుడు కాన్షీరామ్ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్షీరాంను ఆదర్శంగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ప్రత్యామ్నాయ రాజకీయ దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

- బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని బహుజన మహాసేన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చింతా రాంప్రసాద్ పేర్కొన్నారు. కాన్షీరామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వర్ధన్ యాదవ్, రవితేజ, నాగరాజు, సాధిక్, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.
- బహుజన సమాజం నిర్మించేందుకు అహర్నిశలు కృషి చేసిన కాన్షీరామ్ చిరస్మరణీయులని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబుమాదిగ తెలియజేశారు. కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుబ్బయ్య, కిశోర్, రవికుమార్, ప్రసాద్, అబ్రహాం, సుభాని, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అంకమ్మనగర్‌కు చెందిన ఆషా శ్రీనివాస్ పాత గోతాల వ్యాపారం చేస్తుంటాడు. సెప్టెంబరు 24న ఆయన సెల్‌కు మెసేజ్ లింక్ వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు గ్రూపు క్రియేట్ చేసి గేమ్‌కు సంబంధించి టాస్క్ పంపారు. ఒక్కో టాస్క్ పూర్తి చేస్తే మెసేజ్ వస్తుందని చెప్పారు. శ్రీనివాస్‌కు 25 టాస్క్‌లు పంపారు. ఇందుకు శ్రీనివాస్ తనకు సంబంధించిన మూడు బ్యాంకుల్లోని అకౌంట్ వివరాలు గ్రూప్ అడ్మిన్‌కు పంపాడు. కొద్దిరోజుల తరువాత శ్రీనివాస్ అకౌంట్‌లో రూ. 6.90 లక్షలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.